కథ

# ఆమె నిర్ణయం

గుజ్జెటి గణేష్

**తలుపులు తెరిచిన జయంతి ఎదురుగా నిలబడి ఉన్న అతణ్ణి చూసి గిరుక్కున వెనుదిరిగింది.**

*ఆమె వాలకం పసిగట్టిన శరత్ కించిత్తు ఆశ్చర్యపోయాడు. రోజూ తను ఇంటికి రాగానే ముద్దులతో ముంచెత్తే జయంతి, ఈ రోజు ఎందుకలా కోపంగా ఉందో అతనికి అంతుపట్టలేదు.*



ఆలోచిస్తూనే మెల్లగా తలుపుల్ని మూయబోయాడు. కానీ, అంతలోనే జయంతి గొంతు గంభీరంగా పలికింది.

"ఆ పని చేయకండి! దయచేసి ఇక్కణ్ణించి వెళ్ళిపొండి!"

శరత్ ఉలిక్కిపడి తల తిప్పి ఆమె వంక ఆశ్చర్యంగా చూశాడు. అయినా వెంటనే సర్దుకుని "జయంతీ... ఏంటి ఈరోజు అదోలా ఉన్నావు... ఒంట్లోగాని బాలేదా ఏంటీ...?" అని అడిగాడు. అతని ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి.

అతని మాటకు సమాధానమేమీ చెప్ప కుండా అతని కళ్ళలోకి చూసింది.

ఆ చూపులో అతణ్ణి నిలువునా కాల్చి చంపాలన్నంత కోపం!

ఆ చూపులో ఏదో చచ్చిన శవాన్ని పీక్కు తినే రాబందును చూసినంత అసహ్యం!!

అయినా, శరత్ ఆ చూపులోని భావాన్ని పసిగట్టే స్థితిలో లేడు. హఠాత్తుగా ఆమెలో కలిగిన ఈ మార్పుకు కారణమేమిటా: అని ఆలోచిస్తున్నాడు! తను ఆమె పట్ల ఏమైనా దురుసుగా ప్రవర్తించాడా లేక ఆమె మనస్సు గాయపర్చే మాటలేమయినా మాట్లాడానా అని ఆలోచిస్తున్నాడు.

"శరత్‌గారూ!" అతని ఆలోచనల్ని కల్లోల పరుస్తూ అంది జయంతి- "ఇంతకాలం... మీ లాంటివారు ఇంటి పట్టున భార్యాబిడ్డల్ని ఎంతో సుఖంగా ఉంచి... కేవలం విలాసం కొరకు మా లాంటి వారి దగ్గరి కొస్తారేమో ననుకున్నాను. కానీ, కట్టుకున్న భార్యనూ, కన్నబిడ్డల్నీ, కడుపుకు తిండీ, ఒంటికి గుడ్డల్లేకుండా కటిక దారిద్ర్యంలోముంచి... ఒళ్ళమ్ముకొని బ్రతికే మాలాంటి వారిపై మోజుపడి... మీ సంపాదనంతా ధారపోస్తున్నా రన్నచేదు నిజాన్ని... ఈ రోజే తెలుసుకున్నాను."

ఆమె మాటలు విని శరత్ దిగ్గున తలెత్తి ఆమె వంక ఆశ్చర్యంగా చూడసాగాడు.

'ఏంటీ... ఈ రోజు జయంతి పెద్ద పతి వ్రతలా మాట్లాడుతోంది! నాపై మోజు తీరి; నాకంటే గొప్పగా డబ్బు వెదజల్లే మరో విటుణ్ణిగానీ పర్మినెంట్ చేసుకుందా ఏంటి! లేక నన్ను ఒదిలించుకోవాలని ఇలా నాటకమాడుతోందా!'

అతని మౌనాన్ని భంగపరుస్తూ "శరత్ గారూ! మీరు నాపై చూపుతున్న ఈ ప్రేమ, ఔదార్యం... మీ భార్యాపిల్లలపై చూపండి. వాళ్ళు ఏ కష్టాల్లేకుండా

సుఖంగా బ్రతుకుతారు. అంతేకానీ...”

ఆమె మాటల్ని మధ్యలోనే ఖండిస్తూ జయంతి వంక కోపంగా చూస్తూ... “జయంతీ...! ఒకవేళ నాపై నీ మోజు తీరి నేనిచ్చే డబ్బు సరిపోక-పోతే సూటిగా ఆ విషయం చెప్పు అంతేగానీ ఇలా డొంక తిరుగుడు మాటలు మాట్లాడి నన్ను బాధపెట్టి వదిలించుకోవాలని చూడకు!” అన్నాడు.

అతని మాటలకు జయంతి కించిత్తు కూడా ఆవేశపడలేదు.

“ఏంటి మీరిచ్చే డబ్బు సరి పోక మిమ్మల్ని వదిలించుకోవాలని చూస్తున్నానా!? బహుశా మీకు తెలుసోలేదో... కూడూ, గుడ్డా లేకుండా కటిక దారిద్ర్యంతో కొట్టుమిట్టాడుతోన్న మీ భార్యా పిల్లల్నీ... కావాలంటే మిమ్మల్నీ కూర్చోబెట్టి పోషించేంత డబ్బూ, స్తోమత నాకున్నాయి.” అంది.

శరత్ నివ్వెరపోయాడు. తేరుకుని “జయంతీ...! నీకు... మా వాళ్ళ గురించి ఎలా తెలుసు?” అడిగాడు.

“చూశారా... మనిషి నిజాన్ని ఎలా భరించలేడో... ఎంత తొందరగా బయటపడ్డాడో!” ఆమె కంఠంలో ఎగతాళి ధ్వనించింది.

“అంటే...?”

“ఇందాక మీరు అడిగిన ప్రశ్నలోనే నా సమాధానముంది. సరే... మీ ఇంటి విషయం నాకెలా తెలిసిందా అని కంగారు పడుతున్నారు...!? ఆ విషయం... మీ భార్యే చెప్పింది!”

“జయంతీ...!”

“ఔను... అన్ని విషయాలూ స్వయంగా మీ భార్యే చెప్పింది. అనుమానముంటే ఇంటికివెళ్ళి అడగండి!”

“అయినా... మా ఆవిడ... ఇక్కడికి...”

“ఔను... ఇక్కడికే వచ్చింది!”

“ఆవిడకి ఈ చోటు...”

అతని మాటలకి మధ్యలోనే అడ్డుపడి ఆవేశంగా అంది జయంతి...” ఆపదలో ఉన్న వారు అవసరం ఉన్న వారు ఇలాంటి చోటుకి రాక తప్పదు! మొదటిరోజుమీరు ఈ చోటికి వచ్చినట్టే!”

“అంటే...?” కంగారుగా అడిగాడు శరత్. అతని మనస్సు కీడు శంకిస్తోంది.

“మీరు భయపడుతున్నట్టు ఆవిడ ఇదేదో... మాలాంటి బజారు మనుషులుండే చోటని గానీ. రోజూ మీరిక్కడికి వస్తారని తెలిసిగానీ... రాలేదు. ముందు... నా కట్టూ, బొట్టూ, నా దర్జా దర్పం చూసి నేనో ఘరానా ఇంటి ఆడపడుచునని భావించి తన కథ, చెప్పుకుని, వీలైతే సాయం చేయమని అడిగింది.

ఆమె మాటలు నాలో నమ్మకం కలిగించాయి. నా ప్రస్తుత జీవన విధానాన్ని పూసగుచ్చి నట్టు వివరించి చెప్పాను.

మొదట్లో ఆమె నిజాంగానే భయపడింది. భయవిహ్వల చూపులతో ఈ పరిసరాల్ని పరిశీలించింది. అలా భయపడ్తోన్న ఆవిడ ఇక్కడ క్షణంకూడా నించోకుండా వెనుదిరిగి పారిపోతుందని అనుకున్నాను.

కానీ... నా ఊహకు భిన్నంగా చిరునవ్వుతో... “ఉద్యోగం చేసి ఒక ఉంపుడు కత్తెను పోషిస్తున్న నా భర్తకంటే... కన్న బిడ్డల్ని పోషించడానికి గత్యంతరం లేని పరిస్థితిలో నేను... ఒళ్ళమ్ముకోడానికి సిద్ధమైతే ‘తప్పు’ చేసినట్టు కాదనుకుంటాను?!” అంది.

ఆవిడ మాటలు కొరడా దెబ్బలా తగిలాయి. కొద్దిక్షణాలపాటు ఆమె వంక శిలా ప్రతిమలా చూస్తూండిపోయాను.

ఆ స్థితిలో కూడా... ఆమె నా ఉన్నత స్థితికి కారణభూతమైన నా వ్యభిచార వృత్తిని క్షణాల్లో బేరీజు వేసి, మరుక్షణంలోనే ఓ నిర్ణయానికి వచ్చినందుకు... ఆమెను అభినందించకుండా ఉండలేకపోయాను.

నన్ను నేను సంబాళించుకొని ఆమెకు నచ్చచెప్పాను. ఇన్నాళ్ళూ మీరు నా కిచ్చి నంత కాక పోయినా... ఎంతో కొంత డబ్బు ఆమె చేతిలో పెట్టి ఇంటికి పంపించాను.

కానీ, మీ ఆవిడ వెళ్ళిన తరువాత కూడా ఆమె అన్న మాటలు నా చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి.

అందుకే, నాలో నిద్రాణమైన ఆత్మాభిమానం మేల్కొని నన్ను ఆలోచింపజేసింది.

అంతే... ఒకసాటి ఆడదాని కాపురంలో చిచ్చుపెట్టి; ఆమె కన్నీళ్ళతో నా కడుపు నింపుకుంటున్నా నన్న లజ్జా భావం నాలో తలెత్తింది.

అందుకని... మీకు చేతులెత్తి దణ్ణంపెడుతున్నాను... నన్ను మరిచిపోండి! మరెప్పుడూ నా ఛాయల్లోకి రాకండి!

నేను ఒళ్ళమ్ముకొని బ్రతికేదాన్నే కావచ్చు! అయినంత మాత్రాన నాలో మంచితనం, మానవత్వం లేవనీ... తోటి మనుషుల బాధల్ని అర్థంచేసుకోలేనంత కఠినురాల్నని భావించకండి!

మీ ఆవిడ ఎంతటి విపత్కర పరిస్థితిలోనో అలాంటి దారుణానికి తల ఒగ్గటానికి సిద్ధపడిందో నేను అర్థం చేసుకున్నాను. మీ ఆవిడ పరిస్థితి నాపై ఎంత ప్రభావం చూపిందో... నన్ను ఎంతగా కల్లోల పరిచిందో మీకు తెలీదు!

ప్లీజ్... వెళ్ళండి! మరెప్పుడూ నా కొంప వైపు కన్నెత్తయినా చూడకండి!” అంటూ చేతులు జోడించింది జయంతి.

❖ ❖

